ప్రజాశక్తి
బుధవారం 25 అక్టోబర్ 2023
5
విజయనగరం




జాతీయ క్రీడల పరిశీలకులుగా వేణుగోపాలరావు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26 నుంచి నవంబర్ 9 వరకు గోవాలో జరగబోయే 37 వ జాతీయ క్రీడలకు విజయనగరం జిల్లాకు చెందిన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావును డిప్యూటీ చీఫ్ డిమిషన్‌గా (పరిశీలకులుగా) ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ నియమించింది. తొలిసారిగా జిల్లా నుండి ఎంపిక చేసినందుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, క్రీడా సంఘాల ప్రతినిధులు వేణుగోపాల్ రావుకు అభినందనలు తెలిపారు.

వైసిపిలో ఎన్నికల హడావుడి



- పలువురికి సీట్లు ఖరారు?
- మిగిలిన వారికి ముచ్చెమటలు
- 26 నుంచి సామాజిక న్యాయ బస్సుయాత్ర

వైసిపిలో ఎన్నికల వేడి మొదలైంది. అటు పార్టీలోనూ, ఇటు కార్యకర్తల్లోనూ ఎక్కడ విన్నా ఎన్నికలు, సీట్ల కేటాయింపులపైనే చర్చనడుస్తోంది. ఇటీవల జరిగిన పార్టీ సమావేశంలోనూ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని క్లారిటీ ఇచ్చిన సంగతి విధితమే. అంతకు ముందే ఇప్పటి పరిస్థితులు రీత్యా సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టిక్కెట్లు ఇవ్వలేమని కూడా స్పష్టం చేశారు. అలా అని టిక్కెట్లు పొందలేనివారు, పొందలేనివారు కూడా నా మనుషులే అంటూ ఒకింత బుజ్జగింపు చర్యలు కూడా ఆ మాటల్లోనే వ్యక్తమయ్యాయి. ఇందుకనుగుణంగానే జిల్లాలో వచ్చే ఎన్నికల్లో ఎవరికి టిక్కెట్లు ఇవ్వాలి? ఎవరిని పక్కన పెట్టాలన్నదానిపై ఇప్పటికే అధిష్టానం క్లారిటీతో ఉన్నట్లుగా సమాచారం. ఇందులో భాగంగానే ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో పలువురికి టికెట్లు ఖరారైనట్లు పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ప్రకటించారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వాస్తవానికి వైసిపి చేయించుకున్న ఐప్యాక్ సర్వేలో జిల్లాల్లో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేక ఉన్నట్లుగా తేలిందని సమాచారం. ఈ సంగతి కాస్త పక్కనబెడితే ఇటీవల బొండపల్లిలో జరిగిన వైసిపి సమావేశంలో గజపతినగరం ఎమ్మెల్యేను మరోసారి గెలిపించు కోవాలంటూ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. అంతకు ముందు ఎస్.కోటలోనూ స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరావే మళ్లీ పోటీ చేయనున్నట్టు మూడురోజుల క్రితం ఎల్.కోటలో జరిగిన సమావేశంలో చెప్పారు. దీంతో, కురుపాం కొంతమంది ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురించి ప్రస్తావన తేగా 'ఆ సంగతి సిఎం గారు చూసుకుంటారు' అంటూ బుదురిచ్చినట్టు సమాచారం. దీనికి ముందు మాట్లాడిన మంత్రి బొత్స కూడా అధిష్టానం నిర్ణయం శిరోధార్యంగా భావించాలంటూ చురకలు అంటించారు. దీంతో, గజపతినగరంలో బొత్స అప్పలనర్సయ్య, ఎస్.కోటలో కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ల విషయంలో లైన్ క్లియర్ అయినట్లే.

ఇక చీపురుపల్లి నుంచి మంత్రి బొత్స, విజయనగరం నుంచి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభ్యర్థిత్వం కాదనే పరిస్థితి దాదాపు లేదు. ఒక వేళ మంత్రి తప్పనిసరి పరిస్థితుల్లో ఎంపీగా పోటీచేయాల్సి వస్తే, ఆయన సతీమణి, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మికి చీపురుపల్లి నుంచి అవకాశం ఇస్తారని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇటీవల నెల్లిమర్ల నియోజకవర్గ సమావేశం జరిగినప్పటికీ 'బస్సు యాత్ర విజయవంతమైతే మీ ఎమ్మెల్యే గెలుస్తారు' అంటూ వైవి సుబ్బారెడ్డి వ్యాఖ్యానించినట్టు సమాచారం. బొబ్బిలి సిట్టింగ్‌కు మరోసారి అవకాశం ఇవ్వడం కష్టమేనని సాక్షాత్తు ఆ పార్టీ నాయకులు వాదన. రాజాంలో వైసిపికి పట్టుతగ్గినట్టుగా ప్రచారం జరుగుతోంది. దీనికితోడు టిడిపి నుంచి ధీటైన అభ్యర్థిని రంగంలోకి దింపే అవకాశాలు ఉండడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేకి మరో అవకాశం ఇవ్వాలా? లేదా అన్నదానిపై లోలోపల ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ముగ్గురు ఎమ్మెల్యే సీటు విషయంలో ముచ్చెమటలు పడుతున్నట్టుగా ప్రచారం నడుస్తోంది. మరోవైపు టిడిపి అధినేత చంద్రబాబు జైలులో ఉండడం, నారా లోకేష్ కూడా ఆ కేసుల నుంచి బయటపడే పనిలో పరిమితం కావడంతో ఇదే అదునుగా జనంలోకి వెళ్లేందుకు వైసిపి భావిస్తోంది. అందులో భాగంగానే ఇటీవల జగనన్న వైద్యారోగ్య శిబిరాలు నిర్వహించింది. ఈనెల 26 నుంచి సామాజిక న్యాయం పేరిట బస్సు యాత్రకు సన్నద్ధమౌతోంది. నవంబర్ 1నుంచి 'మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి ఎందుకు కావాలి' అంటూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రెండు కార్యక్రమాల సన్నాహక సమావేశాల్లో భాగంగానే టిక్కెట్లు ఖరారు చేయడం చూస్తుంటే వైసిపిలో ఎన్నికల హడావుడి ముమ్మరంగానే సాగుతున్నట్టుగా స్పష్టమౌతోంది.

అనగనగా ఓ వంతెన


వేగావతి నదిలోనుంచి నడుచుకుంటూ వెళ్తున్న జనం

- మూడు ప్రభుత్వాలు మారినా.. తీరని 8 గ్రామాల రహదారి కష్టాలు
- 16 ఏళ్లుగా అసంపూర్తిగా వంతెన నిర్మాణం
- వర్షాకాలంలో రాకపోకలు బంద్

మండలంలోని శివరాంపురం సమీపంలో వేగావతి నదిపై చేపట్టిన వంతెన నిర్మాణం 16 ఏళ్లుగా అసంపూర్తిగా మిగిలి ఉంది. ప్రస్తుత డిప్యూటీ సిఎం రాజన్నదొర ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2007లో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ఉమ్మడి జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే రాజన్నదొర భూమి పూజ చేశారు. తర్వాత కొన్నాళ్లకు కాంట్రాక్టరు మరణించడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మూడు ప్రభుత్వాలు మారినా 8 గ్రామాల రహదారి కష్టాలు మాత్రం తీరలేదు. 16 ఏళ్లుగా వంతెన నిర్మాణం అసంపూర్తిగా మిగిలి ఉంది. వేగావతి వంతెనపై శివరాంపురం సమీపంలో నిర్మించిన వంతెన అసంపూర్తిగా ఉండడంతో చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో వీరి కష్టాలు వర్ణించడానికి వీలుకాని పరిస్థితి.

ప్రజాశక్తి-సాలూరు

2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 3.10 కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వంతెన స్థంభాలు నిర్మించిన తర్వాత కాంట్రాక్టరు మరణించడంతో అదే స్థితిలో ఉండి పోయింది. 2009లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2006లో ఎమ్మెల్యేగా రాజన్నదొర కోర్టు తీర్పు ద్వారా ఎన్నికయ్యారు. రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఆయనే ఎమ్మెల్యేగా పని చేశారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పుడు కూడా ఎమ్మెల్యేగా రాజన్నదొర ఎన్నికయ్యారు. 2019 నుంచి ఆయనే నాలుగోసారి ఎమ్మెల్యే అయ్యారు. గడచిన ఏడాది కాలంగా ఆయన డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. మూడు ప్రభుత్వాల హయాంలోనూ ఆయనే ఎమ్మెల్యేగా ఉన్నారు. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వంతెన నిర్మాణం పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా వంతెన నిర్మాణం చేపడతామని ప్రధాన పార్టీల అభ్యర్థులు హామీలు గుప్పిస్తున్నారు. కానీ ఓడ దాటాక బోడి మల్లన్న చందంగా పాలకులు సమస్యను విస్మరిస్తున్నారు. వర్షాకాలంలో పెద పారన్నవలస ప్రజలు అన్ని గ్రామాల కంటే ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామస్తులు రెండు గడ్డలను దాటుకుని ఊరిలోకి చేరాలి. పెదపారన్నవలస, బోరబంద మధ్య నిర్మించిన కూరగెడ్డ వంతెన కూడా అసంపూర్తిగా మిగిలి ఉంది. కాంట్రాక్టరుకు బిల్లు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

చినపారన్నవలస, పెద పారన్నవలస, భవానీపురం, వంగపండువలస, మిర్తివలస, రొంపిల్లి గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా చిన పారన్నవలస, పెద పారన్నవలస వాసులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శివరాంపురం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉండటంతో సమీప గ్రామాలకు చెందిన విద్యార్థులు గెడ్డలు దాటుకుంటూ వస్తుంటారు. వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహిస్తే ఎక్కడి వారు అక్కడ నిలిచిపోవాల్సిందే. రెండు పారన్నవలస గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వర్షాకాలంలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పట్టణానికి చేరుకోవాల్సి ఉంటుంది. మరో నాలుగైదు నెలల్లో మళ్లీ ఎన్నికలు రానున్నాయి. ఈ ప్రభుత్వంలోనూ వంతెన నిర్మాణం ప్రారంభించే అవకాశం లేదు. ప్రభుత్వాలెన్ని మారినా 8 గ్రామాల రహదారి కష్టాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

జిపిఎస్ రద్దుకు 29న ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న డిఎ, ఎరియర్స్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 29న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద చేపట్టిన మెగా ధర్నాను విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.సదాశివరావు, జిల్లా అధ్యక్షులు డి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎపిటి ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిపిఎస్‌ను రద్దు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ఆర్థిక భారం అని కుంటి సాకులతో నేడు సిపిఎస్ కంటే ప్రమాదకరంగా ఉన్న జిపిఎస్‌ను తీసుకు రావడం అన్యాయ మన్నారు. ఎటువంటి చట్ట బద్ధత లేని జిపిఎస్‌ను రద్దు చేయాలని, అదే విధంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ, పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 29న విజయవాడలో జరిగే ధర్నాకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన సిరెల సూర్యనారాయణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.40లక్షల చెక్కును మంగళవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు. సూర్యనారాయణకు ఇటీవల కుడికాలు శస్త్రచికిత్స అయ్యింది. ఈనేపథ్యంలో జెడ్‌పి చైర్మన్ స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డివేణు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ వి.రమణరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కోట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర, ముంబయి జట్లు విజయం

26న ఫైనల్ మ్యాచ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 మహిళా వన్డే సెమీఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర, ముంబాయి జట్లు విజయం సాధించాయి. మంగళవారం విజ్జి స్టేడియంలో ముంబాయి, బరోడా జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బరోడా జట్టు బ్యాటింగ్ చేసింది. 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 197 పరుగులు చేసింది. ముంబాయి బౌలర్లలో నిమిట్ రానే 3, డ్మెల్లో 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ముంబాయి జట్టు 48 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. ముంబాయి బ్యాటింగ్‌లో హర్లే 64, సాధ్వి సంజయ్ 64 పరుగులు చేశారు. ముంబాయి రెండు వికెట్లు తేడాతో విజయం సాధించింది.

40 పరుగులు తేడాతో మహారాష్ట్ర జట్టు విజయం

స్థానిక చింతలవలస పివిజి రాజు క్రికెట్ అకాడమీలో మహారాష్ట్ర, తమిళనాడు జట్లు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత మహారాష్ట్ర జట్టు బ్యాటింగ్ చెయ్యగా 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 229 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన తమిళనాడు జట్టు 45.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో 26 తేదీన చింతలవలస పివిజి రాజు క్రికెట్ అకాడమీలో జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో ముంబాయి, మహారాష్ట్ర జట్లు తలపడనున్నాయి.

'సీతం'లో రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో రోబోటిక్స్ ల్యాబ్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి, సత్య విద్యాసంస్థల సెక్రటరరీ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, ఐ కియారా డైరెక్టర్ హుయిజాంగ్ యాంగ్, సిఇఒ రంజుల భన్సాలి,సిఒఒ ఆర్.మాధురి, ఇంటర్నేషనల్ కేటాలిస్ట్ శివ కుమార్ వర్మ , ఐ కియారా కోఆర్డినేటర్ ఎన్.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ దసరా పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ చెడు మీద మంచి ఎప్పుడు విజయం సాధిస్తుందని, తెలుపుతూ అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియ జేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్ రావు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు సంబంధించిన 12 రకాల ప్రాజెక్టులను ప్రదర్శించామని, వాటి ద్వారా పిల్లలలో ఉన్న ప్రతిభను బయటకు తీసుకురావడమే ఉద్దేశమని అన్నారు. ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు సంబంధించిన రోబోటిక్స్ ల్యాబ్ తమ కాలేజీలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దసరా సందర్భంగా నగరంలోని వివిధ చోట్ల ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి మండపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి ఉత్సవ మండపానికి చేరుకున్నారు. ఆ తర్వాత బాబా మెట్టలో దేవి పార్కులో వేంచేసియున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం అశోక్ నగర్, బింగివీధి తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన దసరా ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఐదో డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా బాబా మెట్ట దేవి పార్కులో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. 2 ఏళ్ల క్రితం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సహకారంతో శాశ్వత మండల నిర్మాణాన్ని ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు కేవీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.


దుర్గాదేవిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పైడితల్లమ్మ ఆలయంలో కోలగట్ల పూజలు

నగరంలోని అంబటి సత్రం జంక్షన్ వద్ద గల పైడితల్లి అమ్మవారి గుడిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన రాకను పురస్కరించుకుని పైడిమాంబ సేవా కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మధుసూదన రావు, కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సినిమానోత్సవాన్ని పురస్కరించుకుని తమ ప్రాంతం అంబటి సత్రంలో కొలువైయున్న పైడిమాంబ చల్లధనం కార్యక్రమాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. పైడితల్లమ్మ జాతర సందర్భంలో నల్ల మారమ్మ, పైడితల్లమ్మ వంటి గ్రామదేవతలను గద్దె దగ్గరకు తెచ్చి పూజలు చేసి కొలువు తీర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసిపి నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ నిర్వహణకు సహకరించండి : డిఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

పైడితల్లి అమ్మవారి పండగ విజయవంతంగా జరిగేందుకు యువత, ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని డిఎస్‌పి ఆర్.గోవిందరావు అన్నారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులతో డిఎస్‌పి హుకుంపేటలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవం, సిరిమాను తరలింపులో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. సిరిమాను తరలింపు సకాలంలో జరిగితే, ఊరేగింపు నిర్దిష్ట సమయంలోగా పూర్తవుతుందన్నారు. కావున, కమిటీ సభ్యులు, యువత సకాలంలో సిరిమాను తరలింపునకు సహకరించి, వివిధ ప్రాంతాల నుండి పండగను వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవం రోజున భక్తులు సిరిమాను తరలింపుకు ముందే పూజలు పూర్తి చేసుకొనే విధంగా చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో విజయనగరం 2వ పట్టణ సిఐ ఎన్.హెచ్.విజయ ఆనంద్, 2వ పట్టణ ఎస్ఐ షేక్ శంకర్, ప్రధాన పూజారి వెంకటరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గరుగుబిల్లి

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం నాగూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గొట్టివలసకు చెందిన బోను రవికుమార్ (38), కొత్తూరుకు చెందిన కొప్పర గౌరీశంకరరావు, అడ్డాపుశీలకు చెందిన గడదేసి గౌరమ్మ (45) కలిసి వివాహ కార్యక్రమానికి వంట చేసేందుకు బైక్‌పై నాగూరు వెళ్తున్నారు. నాగూరు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరిని పక్కనుంచి ఢీకొంది. దీంతో ముగ్గురు కిందపడిపోయారు. వీరిలో మధ్యన ఉన్న రవికుమార్ తలమీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గౌరమ్మ, గౌరీశంకరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. గౌరమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఆమె మృతిచెందింది. రవికుమార్ భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

టిడిపి ఆధ్వర్యాన జగనాసుర దహనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జగనాసురా దహనకాండతో రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుందని టిడిపి నాయకులు అన్నారు. స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో జగనాసురా దహనకాండ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అసూయ, కుట్ర, కుతంత్రాలతోనే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించారని అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగలం పాదయాత్ర ప్రజల్లో ఎంతో స్పందన వస్తుందని, ఆయన ఎదుగుదలను చూసి వార్వలేని జగన్మోహన్ రెడ్డి ఇటువంటి కుట్ర పన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు కర్రోతు నర్సింగరావు, రొంగలి రామారావు, శ్రీనివాసరావు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం రివర్స్ గేర్ లో నడుస్తోంది..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూర్ఖంగా ఆలోచించి రాష్ట్రాన్ని రివర్స్ గేర్‌లో నడిపిస్తున్నారని టిడిపి నాయకులు గణపతినీడి శ్రీనివాసరావు ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రివర్స్ గేర్‌లో ఎపి అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. మయూరి జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ మీదుగా కోట జంక్షన్ వరకు రివర్స్‌లో పాదయాత్ర అనే కార్యక్రమాన్ని టిడిపి నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రం ఏ పరిస్థితుల్లో ఉందో తెలియజేయడానికి రివర్స్ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన విషయాన్ని గమనించి ప్రజలు మేలుకోవాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లలో పోలవరం, పరిశ్రమల అభివృద్ధి రివర్స్ లోనే ఉన్నాయన్నారు. సైకో సిఎంకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కనకల మురళీమోహన్, బొద్దల నరసింగరావు, కర్రోతు నర్సింగరావు టిడిపి న్యాయవిభాగం నాయకులు ఉపాధ్యాయుల రవిశంకర్, తెలుగు యువత నాయకులు సురేంద్ర, చైతన్య, ప్రవీణ్, టిడిపి నాయకులు కుటుంబరావు, కిలాని మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మూల్యం చెల్లించుకోక తప్పదు


అశోక్‌బంగ్లా వద్ద కరపత్రాలను దహనం చేస్తున్న టిడిపి నాయకులు



రాష్ట్రంలో రివర్సుగేర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

విజయనగరం టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం పైశాచిక ఆనందం కోసమే అరెస్ట్ చేసిందని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. టిడిపి పిలుపు మేరకు జగనాసుర దహనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో సైకో పాలన పోవాలంటూ రాసిన పత్రాలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ వైసిపిని ఓడించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చుని పేర్కొన్నారు. జగన్ లాంటి నియంతకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాటం అశ్విని, అడబాల వేంకటేష్ , ఎమ్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని నేడు ధర్నా

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో హరిత రాయబారులు గత 18నెలల బకాయి జీతాలు చెల్లించాలని ఈనెల 25న మెంటాడ ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నామని సిఐటియు మండల కమిటీ అధ్యక్షుడు అలమండ సన్యాసిరావు, ట్రెజరర్ అలమండ సూరి దేవుడు మంగళవారం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ్ భారత్ పేరుతో హరిత రాయబారులను నియమించి వారికి ఇవ్వవలసిన జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరించి ప్రజల ఆరోగ్యం కాపాడుతున్న వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. హరిత రాయబారులకు రక్షణ కోసం బూట్లు, గ్లౌజులు ఇవ్వకపోవడం వల్ల పలు రోగాల బారిన పడుతున్నారన్నారు. జీతాలు చెల్లించలేక హరిత రాయబారులను తొలగించి తమని బెదిరించడం అన్యాయమన్నారు. జీతాలు చెల్లించి, బూట్లు, గ్లౌజులు ఇవ్వాలన్నారు. ఎంపిడిఒ కార్యాలయం ముందు బుధవారం జరిగే ధర్నా లో హరిత రాయబారులు పాల్గొనాలని వారు కోరారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని పెద్ద శిర్లాం గ్రామంలో కేన్సర్‌తో బాధపడుతున్న కుదిగిన లక్ష్మికి సిఎం రిలీఫ్ ఫండ్ నిధులను అందజేశారు. వైసిపి సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆమెకు సోమవారం రూ. 2లక్షల చెక్కును అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద శిర్లాం వైసిపి నాయకులు, సర్పంచ్ లెంక రాంబాబు, మాజీ సర్పంచ్ పాలవలస జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - జామి

మండలంలోని విజినిగిరి గ్రామం హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ ద్వారా హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాలెపు బంగారు చిట్టి మాస్టర్, వారి తండ్రి కీర్తిశేషులు పాలెపు అప్పలస్వామి వర్ధంతి సందర్భంగా వృద్ధులు, ఒంటరి మహిళలు 80 మందికి దుప్పట్లు, పళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజినిగిరి గ్రామ సర్పంచ్ కిలారి సూర్యారావు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కొవ్వాడ సన్యాసినాయుడు, కొవ్వాడ శ్రీనివాసరావు కిలారి శ్రీనివాసరావు, మిడతన తాత నాయుడ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న హెల్పినగ్ హెండ్స్ సభ్యులు సేవలను పెద్దలు కొనియాడారు.

ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభాస్ యువసేన అధ్యక్షుడు పి.శివ అద్వర్యంలో స్థానిక బొబ్బిలి టీబీర్ థియేటర్ వద్ద టీబీర్ సంస్థల అధినేత తూముల కార్తీక్ చేతుల మీదగా ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. తూముల కార్తీక్ మాట్లాడుతూ ప్రభాస్ యువసేన బొబ్బిలిలో చేసిన సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు దిలీప్, హరి, శ్రీకర్, ప్రభాస్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన యూనియన్ సభ్యులు

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ఎన్నిక మంగళవారం విద్యుత్ భవనంలో ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.ఆర్.కె గణపతి ఆధ్వర్యంలో జిల్లా కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వంగపండు లక్ష్మణ, జిల్లా కార్యదర్శిగా ఎస్. లక్ష్మణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్య నిర్వాహక అధ్యక్షులుగా మంగరాజు, కోశాధికారిగా కూర్మారావు, సభ్యులను ఎన్నుకున్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు.



విజయనగరం : ఆయుధ పూజ చేస్తున్న ఎస్పి దీపిక

పోలీసుశాఖ ఆధ్వర్యంలో దుర్గాపూజ

విజయనగరం: దసరాను పురస్కరించుకొని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం ఆధ్వర్యాన పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలు, పోలీసు వాహనాలకు మంగళవారం ఎస్పి ఎం.దీపిక ప్రత్యేక పూజలు చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వు ఆయుధగారంలోను, మోటారు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్‌లోను దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పోలీసు విభాగాలకు అన్ని విధాలుగా శుభాలు జరగాలని ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పి పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాధ్, ఆర్ఐ ఎన్. గోపాలనాయుడు, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ. నర్సింహమూర్తి, 2వ పట్టణ సిఐ ఎన్‌హెచ్ విజయ ఆనంద్, రూరల్ సిఐ టివి తిరుపతి రావు, ఆర్ఎస్ఐలు నారాయణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, నీలిమ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆయుధపూజ చేశారు. జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయుధ పూజ పోలీసులు, భద్రతా దళాలకు అత్యంత ముఖ్యమైన పండగని చెప్పారు. పోలీసులు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా వ్యవహరించాలని కోరారు. పార్వతీపురం రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్లలో సిఐ కృష్ణారావు, ఎస్ఐ సింహాచలం, దినకర్, నారాయణ తదితరులు ఆయుధ పూజలు నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : దసరా సందర్భంగా జియ్యమ్మవలస మండలం ఇటిక గ్రామంలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ గిరిజన జీవనానికి వినియోగించే పని ముట్లకు దసరా రోజు పూజ చేయడం ఆనవాయితీగా వస్తోందని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు తెలిపారు.

మాలతమ్మ ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

కురుపాం: నేరేడువలస గ్రామంలో వెలిసిన మాలతమ్మ గుడికి దసరా పండగను పురస్కరించుకొని మంగళవారం యాత్రికులు పోటెత్తారు. మన్యం జిల్లాతోపాటు ఒడిశాలోని రాయగడ ప్రాంతం నుంచి భారీగా యాత్రికులు తరలివచ్చారు. గుడి నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని మూలుగూడ జంక్షన్‌లో వాహనాలు ఆపి నడిచి వెళ్తుంటారు. స్థానిక పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

వలస కూలీలకు సౌకర్యాలేవి?

● కనీసం ఆధార్ కార్డుకు కూడా నోచుకోని జనం ● ప్రభుత్వ పథకాలు అందక అవస్థలు ● పిల్లలకు చదువు చెప్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి - వేపాడ

మండలం సోంపురం సచివాలయం పరిధిలో గల నర్సిపల్లి మెట్ట వద్ద వలస కూలీలు సుమారు 50 కుటుంబాలు నేటికీ 40 సంవత్సరాలుగా జీవిస్తున్నారు. క్వారీ పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే వీరికి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వీరిలో కొన్ని కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న జగనన్న సామాజిక పింఛన్లు అర్హత ఉన్నప్పటికీ పొందలేకపోతున్నారు. పలుమార్లు రేషన్ కార్డులకు, సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ఫలితాలు లేవని వాపోతున్నారు.

నిరుపేద కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అది సాధ్యం కావడం లేదని నర్సిపల్లి వెళ్లి చూస్తే అర్థమవుతోంది. ఇక్కడ నివసిస్తున్న వారికి తాగడానికి నీరు లేదు. నివాసానికి యోగ్యంగా ఉండే ఇళ్లులేవు. కరెంటు, వైద్య సౌకర్యం కూడా లేదు. వారి పిల్లలు చదువుకు కూడా నోచుకోని పరిస్థితుల్లో ఉన్నారంటే వారి కష్టాలను అంచనా వేయవచ్చు. కొంత మంది తమ పిల్లలను చదివించాలని భావిస్తున్నా అక్కడ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోంపురం వరకూ నడుచుకుంటూ వెళ్లి చదువుకోవాలి. రోజూ ఆటో, బస్సుల్లో వెళ్లేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీంతో వారి పిల్లలు చదువుకు దూరమవుతున్నారు.



నర్సిపల్లిలో దర్శనమిస్తున్న పూరిపాకలు

కొవ్వొత్తుల వెలుగులోనే జీవనం

నర్సిపల్లిలో నివాసముంటున్న 40 కుటుంబాలకూ విద్యుత్తు సౌకర్యం లేదు. సాయంత్రం అవ్వగానే కొవ్వొత్తులను వెలుగించి ఆ వెలుగులోనే జీవిస్తున్నారు. కరెంటు లేకపోవడం వల్ల టీవీ వంటి వినోద కార్యక్రమాలకు కూడా దూరంగా బతుకుతున్నారు. ఇదంతా మారుమూల కొండ ప్రాంతాల్లో జరుగుతుందనుకుంటే పొరపాటే. కేవలం సోంపురానికి 4కిలోమీటర్ల దూరంలో ఇంత తంతు జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం కొసమెరుపు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి విద్యుత్తు సౌకర్యం, పిల్లలకు పాఠశాల, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

అర్హత ఉంది..కానీ

నాకు అన్ని రకాలుగా ప్రభుత్వ పింఛను అందుకునేందుకు అర్హత ఉంది. వయస్సు కూడా 65 ఏళ్లకు పైగానే ఉంటాయి. కానీ ఇంత వరకూ పింఛను మంజూరు కాలేదు. నాలాంటి వారు మా గ్రామంలో చాలా మంది ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పింఛను మంజూరు చేయాలని కోరుతున్నాను.



పింఛను అందలేదని చెబుతున్న వృద్ధురాలు



పూజలో పాల్గొన్న బొత్స లక్ష్మణరావు దంపతులు

ఘనంగా దుర్గాదేవి ఉత్సవం

ప్రజాశక్తి- విజయనగరం

నగరంలోని తోటపాలెం కోదండ రాముని ఆలయంలో మంగళవారం దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దసరా సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు బొత్స లక్ష్మణరావు దంపతులు, 32వ వార్డు వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర తదితరులు రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆర్లె కృష్ణారావు, పతివాడ సత్యనారాయణ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది.

మందుల స్కామ్ దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇఎస్ఐ డిస్పెన్సరీలో మందుల స్కామ్ దుర్మార్గమని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇఎస్ఐ డిస్పెన్సరీలో మందుల స్కాం జరుగుతుందని అవసరం లేక పోయినా కొన్ని మందులకు ఇండెంట్ పెట్టాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం దారుణ మన్నారు. ముఖ్యంగా ఆయా డిస్పెన్సరీల్లో రోగులకు అవసరమైన 279 మందులు కనుగోలు జరుగుతుండగా 900 రకాల మందులు కనుగోలు చేయాలని చెప్పడం అన్యాయమన్నారు. 40 నుంచి 45 కోట్ల రూపాయలు విలువైన మందులు కనుగోలు చేయాలని డిస్పెన్సరీలకు, సూపరింటెండెంట్లకు ఉన్నతాధికారులు ఆదేశాల జారీ వెనుక మంత్రి హస్తం ఉన్నట్లు ఆరోపించారు.

కాగా కొన్ని కంపెనీల మందుల పేర్లు సిఫార్సు చేయడం దారుణమన్నారు. గతంలో ఇఎస్ఐ మందుల కుంభ కోణం జరిగిన నేపథ్యంలో కమిటీ ద్వారా అవసరమైన 279 రకాల మందులు కొనుగోలు చేయాలని నిర్ధారణ జరిగిందన్నారు. అయితే కాలం చెల్లిన మందులు గత ప్రభుత్వం హయాంలో పార బోయడం జరిగినట్లు తెలిపారు.

కార్మికుల సొమ్ము ఇలా అదనపు ఇండెంట్ పెట్టి వృథా ఖర్చు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అంతే కాకుండా కార్మికుల సొమ్ము వేలకోట్లు ఇఎస్ఐ దగ్గర ఉంచుకొని కార్పొరేట్ మందుల కంపెనీలు ప్రయోజనం కోసం అన్యాయంగా దోచుకోని కార్మికుల పింఛన్లు పెంచక పోవడం దారుణ మన్నారు. గతంలో కూడా ఇఎస్ఐలో మందుల స్కామ్ జరిగిందని ఎప్పటికప్పుడు స్కామ్‌లు జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వందల కోట్ల రూపాయాలను అధికారులు, ప్రజాప్రతినిధులు తినేస్తున్నా ప్రభుత్వం ఎందుకు మౌనం దాల్చుతుందని చెప్పారు. ఇప్పటికైన మందుల స్కామ్ అరికట్టి స్కామ్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో డిస్పెన్సరీల వద్ద కార్మికులు ఆందోళన చేస్తారని ఆయన హెచ్చరించారు.

జానపద కళలను కాపాడాలి

ప్రజాశక్తి- వేపాడ

జానపద కళలను, తెలుగు భాషను కాపాడుకోవాలని గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు కోరారు. మండలంలోని కొండ గంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన సంస్కృతికి మూలాలలైన తోలు బొమ్మలాట, జముకులు పాట, తప్పెట గుళ్ళు, గంగిరెద్దులు, దాసర్లు, బుడబుక్కలు, జంగాలు డప్పులు, థింసా, స్త్రీల పాటలు, బొబ్బిలి యుద్ధం, కాటమ రాజు కథ, గైరమ్మ పాటలు అంతరించి పోతున్నాయని వాటిని కాపాడు కోవాలని కోరారు. ఆంగ్లభాష మాధ్యమ మోజులో మరచిపోతున్న తెలుగు భాషను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా సేవ గరిడి, తప్పెట గుళ్ళు, డప్పులు, ఎరుకుల పాటలు, స్త్రీల పాటలు కళాకారులు తమ పాటలను వినిపించారు. పిల్లలు అమ్మానాన్నముద్దు, మమ్మీ డాడీ వద్దు, అత్తా, మామ ముద్దు, ఆంటి, అంకుల్ వద్దు, తెలుగు భాష ముద్దు వంటి ప్లేకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన పంచాయతీ రాజ్ వింగ్ జోనల్ చైర్మన్ మెరపల సత్యన్నారాయణ మాట్లాడుతూ కళలను కాపాడు కోవాలని వంగ పండు ప్రసాదరావు వంటి వారు ఈ కళలు ద్వారానే ప్రజా గాయకుడు అయ్యారని అన్నారు. కళాపీఠం సభ్యుడు పొట్నూరు సురేష్ మాట్లాడుతూ కూర్మారావు ఇరవై ఏళ్లుగా కళలు, సాహిత్యం పరిరక్షణకు పాటుపడుతూ పుస్తకాలు రాసారని, ఇప్పుడు మా గ్రామాల్లో కళాకారులు సమావేశం జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సేవ గరిడి కళాకారుడు కోట అప్పలనాయుడు, డప్పు కళాకారులు పొట్నూరు శ్రీరాములు, ములపర్తి రాముడు కళాకారులను సాలువలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కళాకారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న గ్రామస్తులు, నాయకులు

పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- డెంకాడ

పరిశ్రమలతోనే యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు వస్తాయని టిడిపి రాష్ట్ర పోలెట్ బ్యూరో సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. మండలంలోని అక్కివరం గ్రామంలో కంది రమాదేవి పేరుమీద మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు ఏర్పాటు చేసిన జయ చంద్ర మిల్క్ ప్రోడక్ట్‌ను అశోక్ గజపతిరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఇలాంటి చిన్న చిన్న పరిశ్రమలు పెట్టేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావాలన్నారు. దీని వల్ల ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఇక్కడ పాలతో ప్రతి ఒక్క వస్తువు తయారు చేసి సప్లయ్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి నాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కర్రతో బంగారు రాజు, మాజీ ఎంపిపి మహంతి చిన్నంనాయుడు, నియోజకవర్గంలో నాలుగు మండలాల టిడిపి మాజీ ఎంపిపిలు, మాజీ జెడ్‌పిటిసిలు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



మిల్క్‌ప్రొడెక్ట్‌ను ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు

తాగునీరు వృథా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలిలో తాగునీటి పథకం నుంచి వేల లీటర్ల తాగునీరు వృథాగా పోవడంతో నీరు చాలక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొడ్డవలస గ్రామం నాగావళి నది వద్ద 49 కోట్లు రూపాయలతో పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. వీటి నుంచి నాలుగు మండలాలతో పాటు చీపురుపల్లికి తాగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. అయితే సంకిలి సమీపంలో ఈ ప్రాజెక్టు లీకులు రూపంలో వృధాగా పోతుంది. ఈ వృథా నీటితో నూతనంగా నిర్మించిన రాజాం- పాలకొండ ప్రధాన రహదారి బెర్మ్‌లేక పోవడంతో గుంతలమయంగా మారుతోంది. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో వృధాగా పోతున్న తాగు నీటిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు



బోడికొండపై జమ్మివేటను నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా జమ్మివేట ఉత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం జమ్మి వేట ఉత్సవం నిర్వహించారు. దేవాలయంలో ప్రాతః కాలార్చన బాల భోగా అనంతరం యాగశాలలో సుందరకాండ ఆదిత్య హృదయము, సుదర్శ నాష్టకము, సుదర్శన కవచము, హవనం వైదిక సిబ్బంది నిర్వహించారు. ఆస్థాన మండపంలో కళ్యాణోత్సవం నిర్వహించి, దసరా సందర్భంగా సాయంత్రం సీతారామచంద్ర స్వామివారిని పల్ల కిలో ఊరేగింపుగా కొండ మెట్ల దగ్గరికి తీసుకొని వెళ్లి శ్రీ స్వామి ధనుస్సు ధనుర్బానము, ఖడ్గం జమ్మి చెట్టు దగ్గర ఉంచి విశ్వక్సేన ఆరాధన పుణ్యా హవాచనం, స్వామి యొక్క ధనస్సు ధనుర్బా ణములకు విశేష అర్చనలు అర్చకులు నిర్వహిం చారు. అనంతరం స్వామి ప్రసాదములు భక్తులకు అందజేశారు. రామస్వామిని పల్లకిలో దేవాల యానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ బి హెచ్‌వి ఎస్ఎన్ కిషోర్ కుమార్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

28న దేవస్థానం మూసివేత

ఈ నెల 28న పాక్షిక చంద్ర గ్రహణం వల్ల రామతీర్థం రామస్వామి దేవస్థానం మూసివేస్తామని దేవస్థానం సహాయ కమిషనర్ బిహెచ్‌విఎస్ఎన్ కిషోర్ కుమార్ తెలిపారు. మంగళ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం రాహు గ్రస్త పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా సాయంత్రం 5 గంటల నుంచి దర్శనం నిలిపి వేసి రాత్రి 1 గంట నుంచి 2.30గంటల వరకు ఆలయం మూసి వేసివేస్తున్నట్లు తెలిపారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం దేవాలయం తెరిచి స్వామివారి సంప్రోక్షణ జరిపి బాలభోగం అనంతరం భక్తుల దర్శనానికి అనుమతిస్తామన్నారు. ముందస్తుగా ఎవరు దర్శనానికి వచ్చినా అనుమతించమన్నారు.

చంద్రబాబుకు అండగా నిలవాలి

మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి

ప్రజాశక్తి - జామి

చంద్రబాబును అరెస్టు చేసిన వైసిపి సైకో పాలనను ప్రజలకు వివరిస్తూ, బాబుకు అండగా టిడిపి కుటుంబమంతా నిలవాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరా కళ్యాణ మండపం వద్ద మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల సమస్యల పై ఎప్పటికప్పుడు పోరాడుతూనే, పార్టీ బలోపేతానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు మధ్య ఉన్న చిన్న చిన్న పొరపచ్చాలు పక్కను పెట్టి, అటు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడంతో పాటు నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా ఉన్న వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించుకోవాలని కోరారు. ఓటరు జాబితా వెరిఫికేషన్ చేయడంతో పాటు పలు కీలక అంశాలపై 27, 28, 29 తేదీల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గం అభివృద్ధిని కుంటి పరిచిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్ళి, వైసిపి వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పెదబాబు నాయకత్వంలో మండల పార్టీ బలోపేతం చేయాలని, అందుకు పెద్దలు అంతా సహకరించాలని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంప్రసాద్ కోరారు. మళ్ళీ మండల టిడిపి పార్టీలో పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. బండారు పెదబాబు మాట్లాడుతూ గొంప కృష్ణ తీరు మారకపోవడంతో కోళ్లతో కలిసి పని చేయాలని నిర్ణయించు కున్నానని వివరించారు. కోళ్ల నాయకత్వంలోనే పని చేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో వర్రీ రమణ, గనివాడ ఏర్నాయుడు, టిడిపి పార్లమెంటరీ నాయకులు శ్రీలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు స్వామి నాయుడు, సూర్యారావు, ధనియాల పైడిరాజు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొంప వెంకటరావు హౌస్ అరెస్ట్

వేపాడ: టిడిపి అధిష్టానం పిలుపు మేరకు మనం చేద్దాం జనాసుర దహనం కార్యక్రమానికి సిద్ధమవుతున్న టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావుని వల్లం పూడి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దశమి సందర్భంగా గ్రామాల్లో టిడిపి నాయకులు ఈ కార్యక్రమానికి సిద్ధమవుతుండగా పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా హౌస్ అరెస్టు చేసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న సైకో జగనాసురుడి పీడ పోవాలని నినాదంతో ఈ కార్యక్రమానికి అధిష్టానం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించకుండా ముందు చర్యల్లో భాగంగా హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఎటువంటి తప్పు చేయని చంద్రబాబును ఆధారం లేకుండా జైల్లో నిర్బంధించి ఉంచడం అన్యాయమన్నారు. ఇటువంటి రావణసురా పాలన పోవాలంటే ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కృషి చేయాలని కోరారు.



గొంప వెంకటరావును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అనాథ పిల్లలను దత్తత తీసుకుంటా

ఢీ డాన్స్ మాస్టర్ మణికంఠ

ప్రజాశక్తి - భోగాపురం

ఈ ప్రాంతంలో అనాధ పిల్లలు ఉంటే దత్తత తీసుకొని వారి పూర్తి బాధ్యతలు తానే తీసుకుంటానని ఢీ డ్యాన్స్ ప్రోగ్రామ్ విజేత డాన్స్ మాస్టర్ మణికంఠ అన్నారు. భోగాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ బొమ్మ యూత్ ఆధ్వర్యంలో సోమవారం డాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఢీ డ్యాన్స్ ప్రోగ్రాం విజేతలు మణికంఠతో పాటు కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ మీ ఏరియాలో అనాధ పిల్లలు, పేదరికంలో ఉండి చదువుకోవడానికి ఇబ్బంది పడే విద్యార్థులు, మేజర్ ఆపరేషన్ చేయలేక ఇబ్బంది పడుతున్న చిన్నారులను ఆదుకుం టానని ఆయన అన్నారు. అందుకు ఎవరైనా అలాంటి వారు ఉంటే ఎస్ఎస్‌టి ఈవెంట్స్ లక్కీ, జోగేంద్ర, సిద్దార్థ్‌కు చెందిన ఫోన్ నెంబర్లు 96524 08842, 8520995511ను సంప్రదించా లన్నారు. ఏ డ్యాన్స్ ప్రోగ్రామ్‌కి వెళ్లినా అక్కడ వచ్చిన ఆదాయంలో 20 శాతం పేదలకు ఖర్చు చేస్తు న్నానని అన్నారు. అంతకుముందు మణికంఠ, కావ్య వివిధ పాటలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



అభిమానులతో మణికంఠ సెల్ఫీ

ఐటిడిఎ పార్కుకు పండగ కళ

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలో తోటపల్లి జలాశయం వద్ద ఉన్న ఐటిడిఎ పార్కుకు మంగళవారం పండగ కళ వచ్చింది. దసరా సందర్భంగా వరుస సెలవులు కావడంతో పర్యాటకులు తరలిరావడంతో పార్కులో సందడి నెలకొంది. విజయదశమి సందర్భంగా కురుపాం మండలంలోని నేరేడువలసలో మాలతమ్మ ఆలయానికి వెళ్లే యాత్రికులు మార్గం మధ్యలో ఉన్న పార్కును సందర్శించి వెళ్లారు.

ఎంఇఒల సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎంఇఒల వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించినట్లు ఎంఇఒల సంఘం జిల్లా అధ్యక్షులు సామల సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం పర్యటనకు వచ్చిన మంత్రిని సోమవారం కలిసి ఎంఇఒలకు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారాలను కల్పించాలని కోరారు. ఎంఇఒ-1, 2లకు స్పష్టమైన జాబ్‌చార్ట్ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఎంఆర్‌సిలకు ఇస్తున్న గ్రాంట్ రెండు లక్షల రూపాయలకు పెంపుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. నూతన భవనాలు ఏర్పాటుచేయాలని, వాహన సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఎంఇఒల వినతిపై విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎన్.నాగభూషణరావు, బడే జనార్దన నాయుడు, కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

31న కోరన్న, మంగన్న వర్ధంతి సభ

ప్రజాశక్తి-పాచిపెంట

కురుపాం మండలం మామిడిమానుగూడ గ్రామంలో ఈ నెల 31న కోరన్న, మంగన్న వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సుకురు అప్పలస్వామి, పాచిపెంట మండల సహాయ కార్యదర్శి కొర్ర కళ్యాణ్ తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాచిపెంటలో మంగళవారం కోరన్న, మంగన్న వర్ధంతి సభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం ప్రాణాలర్పించిన కోరన్న, మంగన్నలో ఆశయ సాధనకు ఆదివాసీ గిరిజనులంతా కదిలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొర్ర శ్రీనివాసరావు, అర్జున్, సోను, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి- రామభద్రపురం

తారాపురం గ్రామ సరిహద్దులో ఆర్‌టిసి బస్సు ఢీ కొని సోమవారం రాత్రి ఒకరు మృతి చెందారు. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. తారాపురం గ్రామానికి చెందిన బెవర పోలి నాయుడు (50) నడిచి వెళుతుండగా వెనుక నుంచి బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృత దేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పెద్ద కొండరాజుపాలెం పండుగకు వచ్చి ప్రభుత్వ మద్యం షాప్ దగ్గర ఇటీవల జరిగిన కొట్లాట కేసులో పోలీసులు మరో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఇద్దరిలో ఒక మైనర్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఇప్పటి కే ఈ కేసులో ఇటీవలి ఇద్దరిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసామని పోలీసులు తెలిపారు. అయితే ఇందులో ఇద్దరు మైనర్లు ఉండటం విశేషం.